ప్రజాశక్తి
శనివారం 6 మే 2023
5
విజయనగరం



8 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి నిర్వహించనున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శుక్రవారం కోలగట్ల నివాసంలో వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈనెల 8 నుండి జూన్ 11వరకు 33 రోజులపాటు పౌర గ్రంథాలయ శాఖ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎన్.లలిత మాట్లాడుతూ వేసవి సెలవుల దృష్ట్యా 33 రోజులపాటు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 8వ తేదీన ఉదయం 10 గంటలకు ఉచిత వేసవి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమవు తాయని తెలిపారు.

ఆర్థిక సంస్కరణలను తిప్పి కొడితేనే

ప్రభుత్వ విద్యారంగానికి రక్షణ

శేషగిరి స్ఫూర్తితో విద్యా రంగంలో మతతత్వ భావాలను అడ్డుకోవాలి : పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు



శేషగిరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను తిప్పికొట్టడం ద్వారానే ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోగలమని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. రాజ్యాంగం కల్పించిన లక్ష్యాలను అమలు పర్చడం ద్వారానే దేశం సుసంపన్నం అవుతుందని అన్నారు. అందుకోసం నిరంతరం పని చేసిన శేషగిరి మాస్టారి స్ఫూర్తితో ఉద్యమించాలని ఉపాధ్యాయు లకు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ నాయకులు కోరెడ్ల శేషగిరి 2వ వర్ధంతిసభ శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యాన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. తొలుత శేషగిరి చిత్ర పటానికి కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 'భారత రాజ్యాంగం-ఆర్థిక విధానాలు -సామాజిక న్యాయం' అనేఅంశంపై లక్ష్మణరావు స్మారకోపన్యాసం చేశారు. రాజ్యాంగం అమలు జరిపి నేటికి 73 ఏళ్లు అయిందన్నారు. రాజ్యాంగం దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం కల్పించిందన్నారు. సంపద కొద్ది మంది చేతుల్లో కాదు అందరి చేతుల్లో ఉండాలని రాజ్యాంగం చెప్పిన లక్ష్యాలు నేడు దేశంలో అమలు కావడం లేదన్నారు. ప్రధానంగా సంపద ప్రజలకు చెందాలని, ఉత్పత్తి సాధనాలపై ప్రభుత్వ ఆదిపత్యం ఉండాలని, శ్రమ జీవులకు కనీస వేతనాలు, పని గంటలు అమలు కావాలని, ఉపాధి అవకాశాలు కల్పించి, ఉచిత ప్రాథమిక విద్యను అమలు చేయాలని రాజ్యాంగంలో ఉందన్నారు. రాజ్యాంగ లక్ష్యాలకు అనుగుణంగానే 1990 వరకు ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు, ఉచిత విద్యా వైద్యం ఏర్పాటు జరిగిందన్నారు. 1991లో నూతన ఆర్థిక విధానాలను అమలు చేసిన తర్వాత రాజ్యాంగ లక్ష్యాలకు తూట్లు పడ్డాయన్నారు. కొద్ది మంది చేతుల్లోకి సంపద పోగిపడే పాలన సాగుతుంద న్నారు. అందులో భాగంగానే ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్ఇపిని అమలు చేయడం, సిలబస్‌లో మార్పులు తీసుకురావడం, మతతత్వ భావాలను పాఠ్యాంశాల్లో చేర్పించడం వంటి చర్యలు కు పాల్పడుతున్నా రన్నారు. గత 30 ఏళ్ల కాలంలో రాజ్యాంగ లక్ష్యాలకు దూరంగా పాలన సాగుతుంద న్నారు. అందుకు ఉదాహరణే 50 వేల కోట్లు ఆస్తి ఉన్న అదాని మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత పది లక్షల కోట్లు ఆస్తులు సంపాదించారని అన్నారు. సామాజిక న్యాయంలో కీలక పాత్ర విద్యారంగానిదని, అటువంటి విద్యా రంగంలో చరిత్రను వక్రీకరించి, శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయకుండా మతతత్వ భావాలతో కూడిన విద్యా విధానం అమలుకు పూనుకుంటున్నారని ఆవేదన చెందారు. సామాజిక ఐక్యతను కలిగించే పాఠ్యాంశాలను తొలగించే ప్రయత్నం జరుగుతోం దన్నారు. రాజ్యాంగ లక్ష్యాలు అమలు జరగాలంటే ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను తిప్పి కొట్టాలని, అప్పుడే దేశానికి, ప్రజలకు,ప్రభుత్వ రంగానికి, సామాజిక న్యాయానికి అవకాశం ఉంటుందని అన్నారు. అటువంటి ఉద్యమ స్ఫూర్తితో శాస్త్రీయ విద్యా విధానం కోసం, అసమానతలు లేని సమాజం కోసం శేషగిరి కృషి చేశారన్నారు. ఎన్ఇపిని పూర్తిగా అధ్యయనం చేసి 20 వ్యాసాలు రాసారంటే విద్యారంగంపై ఆయన ముందు చూపునకు నిదర్శనమన్నారు. ఏదైతే సమ సమాజం కోసం ఐక్య ఉద్యమాలు చేపట్టడానికి కృషి చేశారో ఆ కృషిని కొనసాగించాలని, అప్పుడే శేషగిరికి నిజమైన నివాళి అని అన్నారు. అందుకు వేదికగా శేషగిరి విజ్ఞాన కేంద్రం ఉండాలని ఆకాంక్షించారు.

ఎపిటిఫ్ 257 నాయకులు షేక్ భుకారి బాబు, ఎపిటిఫ్ 1938 జిల్లా అధ్యక్షులు డి.ఈశ్వరరావు మాట్లాడుతూ శేషగిరి ఎన్నో ఐక్య ఉద్యమాలకు ఆద్యుడని అన్నారు. సమస్య ఏదైనా అధ్యయనం చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో చైతన్యం తీసుకు రావడంలో ఆయన స్ఫూర్తిదాయకుడని కొని యాడారు. నేడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఆయన అందించిన స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం శేషగిరి తో ఉన్న అనుబంధాలను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మోహనరావు, డి.రాము తదితరులు తెలియజేశారు. కె.విజయగౌరి మాట్లాడుతూ శేషగిరి పోరాట స్ఫూర్తిని ఉపాధ్యాయులు కొనసాగించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సత్య శ్రీనివాస్, అప్పల నాయుడు, జిల్లాప్రధాన కార్యదర్శి జెఎవి అర్‌కెఈశ్వరరావు, నాయకులు పార్వతి, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్, సిఐటియు నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, కె.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, ఎల్ఐసి యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాస, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్, నాల్గో తరగతి ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు గంగా ప్రసాద్, శేషగిరి సతీమణి హేమలత, కుమారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు



కలెక్టరేట్ భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

12 నాటికి రీసర్వే పూర్తి

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 12వ తేదీ నాటికి సర్వే రాళ్లను పాతించి, మొదటి విడత గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆర్డీవోలు, తాహశీల్దార్లు, సర్వేయర్లతో శుక్రవారంకలెక్టరెట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూముల రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, గ్రౌండ్ ట్రుతింగ్, రికార్డుల నమోదుపై మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ మొదటి, రెండో దశల్లో ఇప్పటి వరకు, జిల్లా వ్యాప్తంగా సుమారు 60 శాతం సర్వే ప్రక్రియ పూర్తి కావస్తోందని చెప్పారు. రీ సర్వేకు సంబంధించి సర్వే రాళ్ళు, అవసరమైన పరికరాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కావాల్సిన సర్వే రాళ్ళు కూడా అయా మండలాల్లో సిద్దంగా ఉన్నాయని చెప్పారు. ఇంకో 80వేల రాళ్ళను పాతాల్సి ఉందన్నారు. అవసరమైన కూలీలను సిద్ధం చేసుకొని రోజుకు కనీసం 10 వేల రాళ్ళు పాతించాలని సూచించారు. జిల్లాకు అవసరమైన రోవర్లు కూడా ఇప్పటికే వచ్చాయన్నారు. వర్షాల వల్ల కొన్ని మండలాల్లో సర్వే రాళ్లను పాతడం ఆలస్యం అయిందని చెప్పారు. మే 12 నాటికి అన్ని గ్రామాల్లో రాళ్ళు పాతడం పూర్తి కావాలని ఆదేశించారు. విజయనగరం డివిజన్లో 9వ తేదీ నాటికి, చీపురుపల్లి డివిజన్లో 10వ తేదీ నాటికి, బొబ్బిలి డివిజన్లో 12 నాటికి పని పూర్తి చేయాలని చెప్పారు. వేగంతో పాటు అత్యంత ఖచ్చితంగా రీ సర్వే ప్రక్రియ జరగాలని స్పష్టం చేశారు. సర్వే తో బాటు రెండు మూడు రోజుల్లో రికార్డుల నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జెసి మయూర్ అశోక్ మాట్లాడుతూ, పరస్పరం సమన్వయంతో పని చేయాలని, ఈ ఆదివారం కూడా ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా పనిచేసి సర్వే ప్రక్రియను పూర్తిచేయాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ ఎం.గణపతిరావు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, సర్వేశాఖ ఎడి త్రివిక్రమరావు, తాహశీల్దార్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

కలెక్టరేట్ కార్యాలయాలను, ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. భవనాలను, వసతులను పరిశీలించారు. నిర్వహణ మరింత మెరుగు పర్చాలని, అడ్డదిడ్డంగా పెరిగిన చెట్లను తొలగించాలని, స్పెషల్ డ్రైవ్ పెట్టి పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్ పరిపాలనా కార్యాలయాన్ని తాత్కాలికంగా వేరే భవనంలోకి తరలించి, పాత భవనాన్ని బాగు చేయించాలని ఆదేశించారు. కార్యాలయాల వద్ద ఉన్న పాత వాహనాలను, పాత వస్తువులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీలో జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఎఒ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు

అధికారులతో డిఆర్ఒ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఒ గణపతిరావు

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 10న జిల్లా వ్యాప్తంగా జరిగే పాలిసెట్ ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలని, తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం తన ఛాంబర్లో సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి పరీక్షను సజావుగా జరిపించాలని సూచించారు. వైద్యారోగ్య, ఆర్టీసీ, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆయా కేంద్రాలకు సరిపడా ఆర్టీసీ బస్సులు నడపాలని, వైద్యపరమైన సదుపాయాలు సమకూర్చుకోవాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. 10వ తేదీ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 30 కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని డిఆర్ఒ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9,342 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని వెల్లడించారు. అన్ని కేంద్రాల వద్ద 144సెక్షన్ అమల్లో ఉంటుందని, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎలాంటి సాంకేతిక పరికరాలు తీసుకురావొద్దని, సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్-2023 కో-ఆర్డినేటర్ జె.ఆశారాణి మాట్లాడుతూ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విద్యుత్, ఆర్టీసీ, పోలీసు, వైద్యారోగ్య శాఖ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్లు, ఇతర లైజెన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎగ్జామినేషన్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

అక్కసుతోనే టిడిపి విమర్శలు

చంద్రబాబు చేసిన శంకుస్థాపన బూటకం
వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అక్కసుతోనే టిడిపి నాయకులు భోగాపురం విమానాశ్రయ శంకుస్థాపన కార్యక్రమంపై విమర్శలు చేస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు రోజులుగా ప్రతిపక్ష నాయకులు ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధిపై మట్టి కొట్టేందుకు ప్రయత్నించడం సరైనది కాదన్నారు. టిడిపి హయాంలో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఎటువంటి అనుమతులూ తీసుకురాలేదని, తెస్తే ఆధారాలు చూపించాలని సవాల్ చేశారు. అశోక్ గజపతిరాజు ఇంకా రాచరిక పోకడలతో ఉన్నారన్నారు. ఎయిర్ పోర్ట్ నిర్వాసితులకు భూములు తిరిగి ఇస్తామని వైసిపి ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఎయిర్ పోర్ట్‌ను రద్దు చేయమని ప్రతిపక్షాలు కోరడం వెనక కారణం ఏమిటని ప్రశ్నించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి వల్ల దేశంలో భోగాపురం విమానాశ్రయంలో రెండు రన్‌వేలు నిర్మించేందుకు జిఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. 30 నెలల్లో ఎయిర్‌పోర్టును పూర్తి చేసి అప్పగిస్తామని జిఎంఆర్ సంస్థ హామీ ఇచ్చిందన్నారు. విమానాశ్రయం పూర్తయితే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని టిడిపి నాయకులకు అక్కసు అన్నారు. విమానయాన శాఖ ఎయిర్ పోర్టు నిర్మిస్తామని బిడ్డింగ్‌లో పాల్గొంటే టిడిపి హయాంలో ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. దీనిపై సి.బి ఐ.విచారణకు డిమాండ్ చేశామని చెప్పారు. వలస వచ్చిన గంటా శ్రీనివాస రావు ఇక్కడ రాజకీయాలు చేయడం దురదృష్టకర మన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు చనుమల్ల వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మేన్ మృతి



స్తంభంపై చిక్కుకున్న లైన్‌మేన్‌ను కిందికి దించుతున్న సిబ్బంది


ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని బూరాడ పేటలో విద్యుత్ స్తంభంపైకి ఎక్కి మరమ్మత్తులు చేస్తుండగా విద్యుత్తు షాక్‌కు గురై సచివాలయం జూనియర్ లైన్‌మేన్ మృతి చెందాడు. జరజాపుపేటకు చెందిన మద్దిల శివ (27) బూరాడపేటలో శుక్రవారం విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్నాడు. స్తంభంపైకి ఎక్కి వైర్లు సరిచేస్తుండగా రిటర్న్ సప్లై రావడంతో విద్యుత్ ఘాతానికి గురై అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. వెంటనే అతన్ని జిల్లా కేంద్రంలోని సర్వ జన ఆసుపత్రి తరలించగా మృతి చెందారు. అవివాహితుడైన శివకు సోదరి, తలిదండ్రులు ఉన్నారు. తలిదండ్రు లిద్దరూ కూలి పనులు చేసుకొని జీవిస్తున్నారు. కష్ట కాలంలో అంది వస్తాడనుకున్న కుమారుడు అకాల మరణంతో తలిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

విజయసాయిరెడ్డిని కలిసిన అవనాపు విక్రమ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి జాతీయకార్యదర్శి, రాజ్య సభ సభ్యులు వి.విజయ సాయిరెడ్డిని శుక్రవారం విశాఖలోని గవర్నర్‌బంగ్లాలో ఆ పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇన్ ఛార్జ్ అవనాపు విక్రమ్, ఉమ్మడి విజయనగరం జిల్లా డిసిఎంఎస్ చైర్‌పర్సన్ భావన దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయసాయి రెడ్డిని శాలువతో సత్కరించారు. జిల్లాలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రానున్న సాధారణ ఎన్నికలకు యువతను సిద్ధం చేయడం తదితర అంశాలపై చర్చించారు.



చెక్కును అందజేస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి

కల్యాణమస్తు , షాదీ తోఫా నిధులు విడుదల

764 జంటలకు రూ.4.36 కోట్ల లబ్ది

ప్రజాశక్తి-విజయనగరం

వైఎస్సార్ కళ్యాణమస్తు/వైఎస్సార్ షాదీ తోఫా కింద జనవరి, మార్చి - 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని నేరుగా వారి ఖాతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి జమ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి , జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. ఈ పథకం కింద జిల్లాలో మొత్తం 764 మంది జంటలకు 4.36 కోట్ల రూపాయల లబ్ది చేకూరింది. వీరిలో బిసి కులానికి చెందినవారు 694 మంది ఉన్నారు. ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ జంటలకు ఒక లక్ష రూపాయల చొప్పున, కులాంతర వివాహాలు చేసుకున్న ఎస్‌సి, ఎస్‌టిలకు లక్షా 20వేల చొప్పున, బిసిలకు రూ.50వేలు, బిసి కులాంతర వివాహం చేసుకున్న వారికి 75 వేలు, వికలాంగులకు లక్షా 50వేలు, రిజిస్టర్ అయిన భవన కార్మికులకు రూ.40వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తోంది. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి, డిఎల్‌డిఒ నిర్మలా కుమారి, సోషల్ వెల్ఫేర్ డిడి రత్నం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శేషగిరి స్ఫూర్తితో ఉద్యమిద్దాం

వర్ధంతి సభలో తమ్మినేని సూర్యనారాయణ



శేషగిరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యుటిఎఫ్ నేతగా కార్మికవర్గ రాజ్యం కోసం, ఉద్యమాలు బలోపేతం కోసం కృషి చేసిన శేషగిరి మాస్టారి స్ఫూర్తితో కార్మిక వర్గ రాజ్యం కోసం ఉద్యమిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శేషగిరి 2వ వర్ధంతి సభ సిపిఎం అధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ శేషగిరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ సమాజం కోసం, ప్రజాసంఘాల బలోపేతానికి ఆయన అందించిన సేవలు మరువలేనివి అన్నారు.సమ సమాజం కావాలని మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న మార్పులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు సదస్సులు, స్టడీ సర్కిల్స్ , సెమినార్ల ద్వారా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారని అన్నారు. ఉద్యమాభివృద్ధి కోసం, దోపిడీ లేని సమాజం కోసం అయన చేసిన కృషిని కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. సభలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు శేషగిరి పోరాటం మరువలేనిది

బొబ్బిలి : విద్యా రంగ పరిరక్షణకు కామ్రేడ్ శేషగిరి చేసిన పోరాటాలు మరువలేనిదని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మణికుమార్ అన్నారు. సిఐటియు కార్యాలయంలో శుక్రవారం శేషగిరి మాస్టర్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యా రంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి శేషగిరి చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. శేషగిరి ఆశయ సాధనకు పోరాటాలు చేస్తామన్నారు. జాతీయ నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే శేషగిరి మాస్టర్‌కు ఘన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుల ఎస్.శివ, కె.మణి కుమార్, బి.తేజ పాల్గొన్నారు.

సర్వే నెంబర్ 678 ప్రభుత్వ భూమి

ప్రజాశక్తి కథనంపై తహశీల్దార్ స్పందన

ప్రజాశక్తి - జామి

జామి గ్రామంలో సర్వే నెంబర్ 678 ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డు పెట్టామని తహశీల్దార్ హేమంత్‌కుమార్ తెలిపారు. ప్రజాశక్తిలో ఈనెల 4న 'రెవెన్యూ పితలాటకం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. భూ విస్తీర్ణం తప్పుగా రాశారని, కాబట్టి ఇది ఊహాజనిత వార్త అని పేర్కొన్నారు. 678సర్వే నెంబరుకు హద్దులు నిర్ణయించినప్పటికీ భూ ఆక్రమణ దారులు తప్పుడు నంబరుతో రిజిస్ట్రేషన్‌కోసం ప్రయత్నించి నందున వాస్తవ భూమిని పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ చేయొద్దని ఎస్.కోట సబ్ రిజిస్ట్రార్ అధికారిని కోరినట్లు తెలిపారు. భూమి విస్తీర్ణం 1 ఎకరా 34సెంట్లకు బదులు ఎకరా 71సెంట్లుగా వార్తలో పేర్కొనడం సరికాదని పేర్కొన్నారు.

సిటీక్లబ్‌లో టెన్నిస్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం సిటీ క్లబ్, జిల్లా క్రీడాభివృద్ధి సహకారంతో స్థానిక సిటీ క్లబ్ వద్ద వేసవి టెన్నిస్ కోచింగ్ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. కోచింగ్ క్యాంప్‌కు సుమారు 30 మంది బాలురు, బాలికల పాల్గొన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు, క్లబ్ కార్యదర్శి రంగారావు దొర పాల్గొన్నారు. కోచింగ్ ఈనెల 30వరకు ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 8గంటల వరకు జరుగుతుందన్నారు. ఆసక్తి గల పిల్లలను కోచింగ్‌కు పంపాలని కోచ్ పి.గౌరీశంకర్ తెలిపారు.

వైఎస్ఆర్‌టియులోకి సహకార బ్యాంక్ ఉద్యోగుల యూనియన్

ప్రజాశకి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు సమక్షంలో వై ఎస్ఆర్‌టియు యూనియన్ లో శుక్రవారం చేరింది. అధ్యక్షుడిగా ఎస్.సురేష్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా బి.లక్ష్మణరావు, కోశాధికారిగా విజి రవికుమార్, సభ్యులుగా జి.చంద్రమోహన్ నాయుడు, సిహెచ్‌రవికుమార్, బి.అచ్యుత్‌కుమార్, బి.సింహగిరి, ఎన్.సభితకుమారి, ఎ.కమలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కె.బాలాజి ప్రసాద్ , రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పివి ఎస్ఎస్ నాయుడు, రాష్ట్ర సెక్రెటరీ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న కొర్నాన ఆదిబాబు

యాదవ సంఘం అధ్యక్షులుగా కొర్నాన

డెంకాడ: మండలంలోని చినతాడివాడకు చెందిన మాజీ ఎంపిటిసి, టిడిపి నాయకులు కొర్నాన ఆదిబాబు టిడిపి విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించడంలో కృషి చేసిన నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజుకు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేయాలి

బొబ్బిలి: పట్టణంలో రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేయాలని సిపిఎం సభ్యులు ముప్పల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని రోడ్ల విస్తరణ ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేయని వైసిపి ప్రభుత్వం ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేసి ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందించాలని, రోడ్లు, కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామన్నారు.

సింగుబాబు మృతి తీరనిలోటు

నెల్లిమర్ల: మాజీ జెడ్‌పిటిసి డి. సింగుబాబు మృతి కార్మికోద్యమానికి తీరని లోటని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. సింగు బాబు మృతి పట్ల ఆయన శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జ్యూట్ మిల్ లాకౌట్ సమయంలో సింగు బాబు కార్మికుల పక్షాన నిలబడి ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. అధికార పక్షంలో ఉండి కూడా ఒకానొక దశలో స్వంత పార్టీ నాయకులను ఎదిరించి సింగుబాబు జ్యూట్ యాజమాన్యం ప్రతి పాదన పెట్టిన జీతం కోతను కార్మికుల అంగీకరించదని చెప్పిన మొదటి వ్యక్తి అని చెప్పారు. తన తండ్రి నర్సాపు బాబు అడుగు జాడల్లో నడిచి కార్మికుల, ప్రజల సంక్షేమం కోసం పాటు పడిన సింగు బాబు మృతి కార్మిక వర్గానికి, ప్రజలకు తీరని లోటని అన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

గజపతినగరం: మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామంలోని మండల వ్యవసాయాధికారి సి.హెచ్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాలు సాగుని పెంచాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ, రాయితీ వాటి ఆవశ్యకతను వివరించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభం గురించి, ఎరువులు, విత్తన ప్రణాళిక గురించి రైతులతో చర్చించారు. శనివారం తుమ్మికాపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం అవుతుందని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సామంతుల పైడిరాజు, వి.ఆర్.ఒ సింహాచలం, వి.ఎ.ఎ వినయ్ కుమార్, సర్పంచ్ కామునాయుడు, రైతులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

భోగాపురం : మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పార్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 25 వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు మోడల్ స్కూల్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బొబ్బిలి: సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ హెచ్చరించారు. పట్టణంలోని 5,6 సచివాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. వార్డులు కురుస్తున్నందున పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. స్పందనకు వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలని కోరారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి ఊరేగింపు

నెల్లిమర్ల: మండలంలోని కొత్తపేట గ్రామ సమీప రామతీర్థం రోడ్డు వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రతిష్టలో భాగంగా మొదటి రోజు చుట్టుపక్కల గ్రామాల్లో రమా సహిత సత్యనారాయణ స్వామి విగ్రహాలను ఊరేగించారు. అనంతరం, వేద పండితులతో వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కొండేటి సురేష్ మాట్లాడుతూ శని, ఆది, సోమవారం నిర్వహించనున్న కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు

ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించాలి

బాడంగి : ఉపాధి పనులు సక్రమంగా జరపాలని సిఐటియు మండల నాయకులు ఎ.సురేష్ డిమాండ్ చేశారు. మండలంలోని చిన్న భీమవరం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఆరు రోజులు పని చేస్తే నాలుగు రోజులకే డబ్బులు వేస్తున్నారని మిగతా రెండు రోజులు డబ్బులు వేయకపోవడానికి గల కారణమేంటని ప్రశ్నించారు. పనులను కూడా సక్రమంగా చూపించడంలేదని కూలీలు చెబుతున్నారన్నారు. తొమ్మిది గ్రూపులలో ఉండాల్సిన రెండు గ్రూపుల పని చూపించి మిగతా ఏడు గ్రూపులకి పని ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. అందరికీ సమానంగా పని కల్పించకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యం

శృంగవరపు కోట: నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేసిన అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆరోపించారు. వాడవాడల చంద్రన్నబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని మరుపల్లి గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విఎస్ రోడ్ నుండి మరుపల్లి గ్రామానికి 2016లో తాను రోడ్డును తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.80లక్షలతో నిర్మించామని గుర్తు చేశారు. ఆ శిలాఫలకం వద్ద ఆమె సెల్ఫీ తీసుకుని ప్రభుత్వానికి ఛాలెంజ్ విసిరారు. గడిచిన నాలుగేళ్లలో ఇటువంటి ప్రజల ప్రయోజనాల కోసం శాశ్వత నిర్మాణాలను నియోజకవర్గంలోని ఎక్కడైనా చెప్పట్లారా అని ఆమె ప్రశ్నించారు.

విద్యుత్తు దీపాలు ఆపివేత

వేపాడ: వల్లంపూడి జజారు వీధిలో పట్టపగలే విద్యుత్తు దీపాలు వెలుగుతున్న నేపథ్యంలో పగలే వెన్నెల అనే కథనం శుక్రవారం ప్రజాశక్తిలో వెలువడింది. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యుత్ దీపాలు లైట్లను సరి చేశారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

వేపాడ : మండలంలోని సింగరాయ గ్రామంలో సామాజిక కార్యకర్త ఆర్ అప్పారావు ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుని విగ్రహం వద్ద శుక్రవారం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు, మండల దళిత మహాసభ అధ్యక్షులు కొమనాపల్లి రాము మాట్లాడుతూ బుద్ధ పౌర్ణమి సందర్భంగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. గౌతమ బుద్ధుని బోధనలే ఈ దేశానికి శరణ్యమన్నారు. అనంతరం టిడిపి యువ నాయకులు గొంప కృష్ణ సమకూర్చిన దుస్తులను 150 మందికి పంపిణీ చేశారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

ప్రజాశక్తి - కొత్తవలస

బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. చీడివలస గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆయన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేద్కర్ సిద్ధాంతాలను అలవర్చుకొని పేద బలహీన వర్గాల సంక్షేమానికి పాటుపడాలన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం అనుగుణంగా మనమందరం నడుస్తున్నామని చెప్పారు. ఐదే గ్రామంలో రైతు భరోసా కేంద్రం ద్వారా మంజూరు చేసిన ట్రాక్టర్‌ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, మండల పార్టీ అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జెసిఎస్ ఇంచార్జి బొంతుల వెంకటరావు, వైస్ ఎంపిపి కర్రీ శ్రీను, మేలాస్త్రి అప్పారావు, పిఎస్ఎన్ పాత్రుడు, లెంక రామన్న పాత్రుడు, కొత్తవలస సర్పంచ్ మచ్చా ఎర్రయ్య రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మహనీయుడు అంబేద్కర్: ఎమ్మెల్సీ

శృంగవరపుకోట : దేశానికి దశ దిశ చూపిన మహనీయుడు అంబేద్కర్ అనిఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కొనియాడారు. మండలంలోని పెదఖండేపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహము వద్ద పునఃనిర్మాణం చేయబోయే ప్రహరీ గోడకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గతంలో విగ్రహం చుట్టూ ఉండే ప్రహరీగోడ దెబ్బతిన్న కారణంగా, ఇప్పుడు తనవంతు సహాయంతో గోడ నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, సర్పంచ్ రమణ, వైస్ సర్పంచ్ సూర్యనారాయణ, ఎంపిటిసి దేముడు, కృష్ణ మహంతి పురం పిఎసిఎస్ ఇంఛార్జి చైర్మన్ ఇందుకూరి రామరాజు, తలారి ఎంపిటిసి దుర్గాప్రసాద్, మాజీ ఎంపిటిసి నారాయణరావు, స్థానిక నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న అధికారులు

షెడ్డు నిర్మాణం పరిశీలన

వేపాడ : మండలంలోని జాకేరు సచివాలయం వద్ద నిర్మిస్తున్న షెడ్డు పనులను ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ కె. పైడిరాజు, జెఇ వి. దేవి శుక్రవారం పరిశీలించారు. ఇంతవరకు జరిగిన పనులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో గ్రామ పెద్ద బుద్ధ అప్పలనాయుడు, వైసిపి యూత్ నాయకులు బుద్ధ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు పాల్గొన్నారు.

జామిలో నకిలీ విలేకర్ల హల్‌చల్

ప్రజాశక్తి - జామి

మండలంలో నకిలీ విలేకర్లు హల్‌చల్ చేస్తున్నారు. గత కొద్ది కాలంగా తాము విలేకర్లుగా చెప్పుకుంటూ క్వారీల చుట్టూ తిరుగుతూ, భారీ మొత్తాలు డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని వారిపై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఒక్క క్వారీలు మాత్రమే కాదు, ఇటుక బట్టీలపైన, క్రషర్లపైన ఫిర్యాదులు చేస్తూ ఆయా అధికారులను మరోవైపు కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారు. ఎస్.కోట మండలానికి చెందిన ఈ నకిలీ విలేకర్లు గతంలో పలు టివి ఛానళ్లలో విలేకర్లుగా పని చేశారు. అప్పటిలో భారీ వసూళ్లకు పాల్పడటంతో ఆయా సంస్థలు అందులోంచి తొలగించాయి. వేపాడ మండలంలో దందాకు దిగడంతో అప్పట్లో ఈ నకిలీ విలేకర్లు పై దాడులు కూడా జరిగినట్లు సమాచారం. అంతేకాదు కొన్ని మండలాల్లో వీరిపై కేసులు కూడా నమోదైనట్లు ప్రచారం ఉంది. దీంతో ఎస్.కోట, వేపాడ మండలాలు వదిలిపెట్టి ప్రస్తుతం జామి మండలంలో హల్‌చల్ చేస్తున్నారు. గనుల


క్వారీలు ఆధారంగా దందా..!

శాఖను ఆధారంగా చేసుకుని జిల్లా అంతా తిరుగుతున్నారు. వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా క్వారీలు సంక్షోభంలో ఉన్నాయి. ప్రభుత్వ విధానంలో భాగంగా దాదాపుగా 50శాతం క్వారీలు మూతబడ్డాయి. నిర్వహిస్తున్న క్వారీల్లో పనులు చేస్తున్న కార్మికుల సంఖ్య కూడా నామ మాత్రంగానే ఉంది. ఇలా క్వారీల పై తరుచూ ఫిర్యాదులు పెట్టడం, కొంత మంది అధికారులతో కలసి క్వారీల పై దందాకు తెగబడటంతో కార్మికుల ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి క్వారీలపై ఆత్మాభిమానం దళిత, గిరిజనులు ఆధారపడి బతుకుతున్నారు. ఇదే విధంగా క్వారీల పై దందా కొనసాగితే, పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విలేకర్లుగా చల్లామనీ అవుతున్న వారిపై పోలీసులు ఎక్కడికక్కడ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కొత్తవలస

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే పార్టీ గెలుపునకు శ్రీకారం చుడతాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రామలింగాపురం సచివాలయం పరిధిలో చీడివలసలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజలకు గత మూడేళ్ల కాలంలో అందించిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ప్రతి గడపకు వెళ్లి, లబ్ధిదారుల తలుపు తట్టి వారినీ ఆప్యాయంగా పలకరించి సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, మండల పార్టీ అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జెసిఎస్ ఇంచార్జీ బొంతుల వెంకటరావు, వైస్ ఎంపిపి కర్రీ శ్రీను, మేలాస్త్రి అప్పారావు, పిఎస్ఎన్ పాత్రుడు, లెంక రామన్న పాత్రుడు, కొత్తవలస సర్పంచ్ మచ్చా ఎర్రయ్య రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఆట పిల్లల భవితకు బాట: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆట పిల్లల భవితకు బాటని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పట్టణంలోని నారాయణ – కేంబ్రిడ్జి పాఠశాలలో నెలరోజుల పాటు నిర్వహించనున్న వేసవి షటిల్ బాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ వేసవి కాలంలో పిల్లలకు మానసిక ఉల్లాసం, షటిల్ బాడ్మింటన్ పై ఆసక్తి కలిగించడంతో పాటుగా ఈ క్రీడ పట్ల నైపుణ్యత పెంపొందించేందుకు, ఫ్రెండ్స్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 18 సంవత్సరాల నుండి వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 70 మంది పిల్లలతో కూడిన ఈ శిక్షణా శిబిరం మే 31వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం క్రీడాకారులకు పౌష్టిక ఆహారంగా పాలు, గుడ్లు, దాతల సహాయ సహకారాలతో అందిస్తారని, క్రీడా దుస్తులను కూడా క్రీడాకారులందరికీ అందిస్తారని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి, స్టోన్ క్రషర్ అధినేత వెంకటరావు, ధర్మవరం జిల్లాపరిషత్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ శ్రీరాములు, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు మళ్ళా రామకృష్ణ, డాక్టర్ సత్యశేఖర్, మజ్జి గంగరాజు, జెవిఎస్ ప్రసాద్, సతీష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

ప్రాణాలు పోతున్నా రోడ్లు బాగుచేయరా?

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రజలు ప్రాణాలు పోతున్నా రోడ్లు బాగు చేయకపోవడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ముప్పల శ్రీనివాసరావు అన్నారు. గొర్లెసీతారాంపురం వద్ద పాడైపోయిన రాష్ట్రీయ రహదారి బాగు చేయాలని కోరుతూ శుక్రవారం సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉన్న రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడినా బాగు చేసేందుకు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. రహదారిపై గోతులు ఉండడంతో ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, అనేకమంది గాయపడి ఆసుపత్రి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం, గాయపడడం జరుగుతున్నా పాలకులు, అధికారులకు చలనం రాకపోవడం దుర్మార్గమన్నారు. పాడైపోయిన రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మణికుమార్, శివ, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై నిరసన తెలుపుతున్న నాయకులు

మద్యం మత్తు వద్దు.. ఉద్యోగాలే ముద్దు

భోగాపురం: మద్యం మత్తు వద్దు ఉద్యోగాలే ముద్దు అనే నినాదంతో నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు అధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో మోకాలపై నిరసన తెలియజేస్తూ కొంతమంది తెలుగు యువత పొర్ల దండాలు పెట్టారు. వైసిపి ప్రభుత్వం ఉద్యోగాలు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మద్యం మత్తు వద్దు ఉద్యోగాలు ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు పిన్నింటి కిషోర్, టిఎన్‌యస్ ఉపాధ్యక్షులు కొత్తకోట బాలకృష్ణ, పూసపాటిరేగ తెలుగుయువత అధ్యక్షులు ఆకిరి జగదీష్, భోగాపురం, నెల్లిమర్ల, డెంకాడ తెలుగు యువత అధ్యక్షులు సరగడ తోగులురెడ్డి, నల్లం శ్రీనివాస్ రావు, బొండ కిరణ్, నెల్లిమర్ల నగర పంచాయతీ అధ్యక్షులు బైరెడ్డి కళ్యాణ్, తెలుగుయువత అధికార ప్రతినిధి చందక ఆనంద్, నాలుగు మండలాల టిఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, పాల్గొన్నారు.


రోడ్డుపై నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, యువత

మళ్లీ పులి బెడద

ఆవు దూడను చంపి తినేసిన పులి

శృంగవరపుకోట: చాలా కాలం తరువాత పులి సంచారం ప్రజలను భయాందోళనకు గురి చేస్తుంది. సంవత్సర కాలంగా మండలంలోని భీమవరం, కృష్ణాపురం, ఐతన్నపాలెం, ముసిడిపల్లి తదితర ప్రాంతాలలో పులి సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల కాలంలో పులి సంచారం లేదని ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో గురువారం రాత్రి మళ్లీ పంజా విసిరి ఆవు పెయ్యను చంపేసింది. నెల రోజుల క్రితం ముసిడిపల్లి సచివాలయ పరిధిలో ఆవుని చంపుకు తిన్న పులి గురువారం రాత్రి మండలంలోని భర్తాపురం గ్రామ సమీపంలో మెంటాడ సూరిబాబుకు చెందిన ఆవు పెయ్యను చంపి సమీప చెరుకు తోటలో తీసుకువెళ్లి తినేసింది. ఇలా సంవత్సర కాలంగా పులి సంచారం సాగుతున్న అధికారులు పులిని బంధించేందుకు ఎటువంటి చర్యలూ తీసుకోవటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా ఇంకెంతకాలం తమ మూగజీవాలను కోల్పోవాలోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని పులిని బంధించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


చెరకుతోటలో లభ్యమైన ఆవుదూడ కళేబరం

పనులు పూర్తి చేస్తేనే బిల్లులు

ప్రజాశక్తి - వేపాడ

సకాలంలో పనులు చేస్తే బిల్లులు వచ్చేస్తాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి డి. సత్యవంతుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి మాట్లాడుతూ ఇంతవరకు కొన్ని గ్రామాలలో ఇంటింటికి కుళాయి పనులు చేపట్టామన్నారు. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మిగిలిన గ్రామాల్లో పనులు చేపట్టలేకపోతున్నామన్నారు. ఈ నేపథ్యంలో కొంత మంది సర్పంచులు, ఎంపిటిసిలు మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన పనులకు నిధులు మంజూరు చేయకపోతే ఎవరు ముందుకొస్తారని ప్రశ్నించారు. వావిలపాడు సర్పంచ్ రాజేశ్వరి మాట్లాడుతూ తహశీల్దార్ కృష్ణంరాజు తమ గ్రామాభివృద్ధిని అడ్డుకుంటున్నారని పైగా ప్రశ్నిస్తే తమపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. వ్యవసాయాభివృద్ధి కమిటీ చైర్మన్ ఈర్లే సన్యాసినాయుడు మాట్లాడుతూ రైతుల సాగులో ఉన్న ఇనాం భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల పేరున 1బిలుగా మార్చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి శానపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు అడపా ఈశ్వరరావు, ముత్యాలమ్మ, ఎఎంసి చైర్ పర్సన్ ఎం. కస్తూరి, ఎంపిడిఒ పట్నాయక్, తహశీల్దార్ కృష్ణంరాజు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి

నిరంతర వాహన తనిఖీలే ధ్యేయం

ప్రజాశక్తి - రామభద్రపురం

అక్రమ రవాణా అరికట్టే విధానంలో భాగంగా నిరంతరం జాతీయ రహదారి పై వాహన తనిఖీలే ధ్యేయంగా సిబ్బందికి విధులు కేటాయించి పర్యవేక్షణ చేపడుతున్నామని బొబ్బిలి రూరల్ సిఐ తిరుమలరావు తెలిపారు. శుక్రవారం స్థానిక చెక్ పోస్ట్ వద్ద ఎస్ఐ సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో పలు వాహనాలు తనిఖీ చేసి వాహన దారులకు సూచనలు జారీ చేశారు. ఎవరైనా నిషేధిత వస్తువుల రవాణాలో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకోవాడంలో వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. ఇటీవల మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా ఎక్కువ అవుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అన్ని సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు.

బొబ్బిలి: గంజాయి నివారణకై వాహనాల తనిఖీ చేస్తున్నామని ఎస్ఇబి సిఐ ఆర్ జైభీమ్ అన్నారు. మండలంలోని గ్రోత్ సెంటర్ జంక్షన్ వద్ద శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి ఇతర డ్రగ్స్ లాంటి నిషేధిత పదార్ధాలు రవాణా జరగకుండా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నామన్నారు. వాహనదారులు సహకరించాలని కోరారు. అనంతరం వాహనదారులకు అవగాహన కల్పించారు.


రామభద్రపురం: వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కాలువలపై సిమెంట్ పలకలు

బొబ్బిలి : పట్టణంలోని మురుగునీటి కాలువలపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమి షనర్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశించారు. పట్టణంలోని సాయిగణపతి థియేటర్, అంట్యాకుల వీధి, దావాలవీధి, ఆర్.సి.యం రోడ్డు, సామలమ్మ గుండం, పాత బొబ్బిలి ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మురుగునీటి కాలువలపై సిమెంట్ పలకలు వేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమను ఆదేశించారు. కాలువలను శుభ్రం చేసుకునేందుకు వీలుగా ఇనుప చువ్వలు ఏర్పాటు చేయాలన్నారు. పాత బొబ్బిలి బాలసదన హాస్టల్ వద్ద వేసిన పెంటకుప్పలను తొలగించాలని కోరారు. ఎవరు పెంటకుప్పలు వేస్తున్నారో గుర్తించి నోటీసులు జారీ చేయాలన్నారు. రోడ్లు, కాలువల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భైరిసాగరం చెరువుకు వెళ్లే కాలువలో పూడికలు తొలగించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని కోరారు. ఆయనతో మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయ ప్రయోగశాల పరిశీలన

నెల్లిమర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇంటిగ్రేటెడ్ వ్యవసాయ ప్రయోగ శాలను నాబార్డు రాష్ట్ర డిజిఎం టి. నాగార్జున పరిశీలించారు. శుక్రవారం ఆయన ప్రయోగ శాలలో విత్తనాలు, ఎరువుల నాణ్యత ప్రమాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు సహకారంతో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్ నిర్వహణ ఎలా నడుస్తుందో పరిశీలించామన్నారు. ఈ పరిశీలనలో ఆయన వెంట నాబార్డు జిల్లా డిజిఎం కెవివి. సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు, ఎఒలు పి.లక్ష్మీ, ఎం. పూర్ణిమ, ఎఇఒ ఎం. దామోదర్ పాల్గొన్నారు.


ప్రయోగశాలను పరిశీలిస్తున్న డిజిఎం నాగార్జున

భూకబ్జాదారులపై చర్యలేవి?

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణ, మండల పరిధిలో జరుగుతున్న భూకబ్జాలపై చర్యలేవని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాతూ రెవెన్యూ యంత్రాంగం ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో వెంటనే పత్రికా ముఖంగా ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాలను, చెరువులను కబ్జా చేస్తున్నారని పలుమార్లు రెవెన్యూ యంత్రాంగానికి విన్నవించుకున్న ఫలితం లేకపోయిందన్నారు. అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఆక్రమణలు మరింత పెరిగాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, మండల కార్యదర్శి మండంగి ఎండుదొర పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నెల్లిమర్ల: నగర పంచాయతి కార్యాలయం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం పాపయ్యమ్మ (60) మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆమె రోడ్డు దాటుతుండగా మినీ వ్యాన్ ఢీకొట్టి గాయాల పాలై సర్వజన ఆసుపత్రిలో చేరింది. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానిక రామ తీర్థం జంక్షన్ సమీపం పాత సినిమా హాల్ వద్ద శుక్రవారం లారీ, ద్విచక్ర వాహనం ఢీ కొట్టిన ఘటనలో రాజాంకు చెందిన వ్యక్తికి గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్సై పి. నారాయణ రావు పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఎత్తు బ్రిడ్జివద్ద అగ్ని ప్రమాదం

విజయనగరం: నగరంలోని ఎత్తుబ్రిడ్జి రాజీవ్ విగ్రహం వద్ద శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. నగర సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన మన విజయనగరం ఎలక్ట్రికల్ బోర్డు, పక్కనే ఉన్న షెడ్డు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.3లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా.



కాలిపోతున్న షెడ్డు, ఎలక్ట్రికల్ బోర్డు